Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి | సంపుటి (Vol) : 6 | సంచిక (Issue): 325 | పేజీలు (Pages): 4 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) | ఆదివారం, 4 - 5 - 2025

94406 62699 | rajadhanivartalu | rajadhaniv | www.rajadhanivartalu.com | RNI No.: APTEL/2019/77985 | స్థాపితం : 2015

# భారత ఓడ రేవులలో పాకిస్థాన్ నౌకల ప్రవేశం నిషిద్ధం




**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత భారత్ – పాకిస్థాన్ల మధ్య, దౌత్యపరమైన ఉద్రిక్తతలు సైతం పెరుగుతున్నాయి. భారత్ తాజాగా ఇవాళ (శనివారం) పాకిస్థాన్ మీద మరో వేటు వేసింది. భారత ఓడరేవులలో పాకిస్తాన్ నౌకల ప్రవేశాన్ని నిషేధించింది. అంతేకాదు, పొరుగు దేశ (పాక్) ఓడరేవులలోకి భారత నౌకలను ప్రవేశించకుండా నిషేధించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డిజిఎస్) ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. "ప్రజా ప్రయోజనం, భారతీయ షిప్పింగ్ ప్రయోజనాల దృష్ట్యా, భారతీయ ఆస్తులు, సరుకు, మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధారించడానికి" "తక్షణమే" ఇంకా "తదుపరి ఉత్తర్వు వచ్చే వరకు" ఆంక్షలు అమలులో ఉంటాయని డిజిఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది."...ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, 1958 మర్చంట్ షిప్పింగ్ చట్టంలోని సెక్షన్ 411 ద్వారా ఇవ్వబడిన అధికారాన్ని ఉపయోగించి, ఆ చట్టం యొక్క ప్రవేశికలో పొందుపరచబడిన లక్ష్యాలు పరిగణలోకి తీసుకోవడమైంది. దీని ద్వారా ఈ క్రింది ఆదేశాలు జారీ చేయబడ్డాయి. పాకిస్తాన్ జెండాను కలిగి ఉన్న ఓడ ఏ భారతీయ ఓడరేవును సందర్శించడానికి అనుమతించబడదు. భారతీయ జెండా నౌక పాకిస్తాన్‌లోని ఏ ఓడరేవులను సందర్శించకూడదు" అని డిజిఎస్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొంది. మర్చంట్ షిప్పింగ్ చట్టంలోని సెక్షన్ 411, జాతీయ ప్రయోజనాల లక్ష్యాన్ని లేదా భారత షిప్పింగ్ ప్రయోజనాల దృష్ట్యా, ఓడలకు ఆదేశాలు జారీ చేయడానికి డిజిఎస్‌కి అధికారం ఇస్తుంది. ఈ చట్టం ప్రపంచంలో ఎక్కడైనా భారతీయ జెండా నౌకలను, ఇంకా భారత జలాల్లో ఉన్నప్పుడు విదేశీ జెండా నౌకలను "సముద్రంలో ప్రాణ భద్రత, ఓడల భద్రతను నిర్ధారించడానికి" తగిన విధంగా వ్యవహరిస్తుంది. కచ్చితంగా చెప్పాలంటే, డిజిఎస్ ఆర్డర్ భారత్, పాకిస్తాన్ జెండాల కింద ప్రయాణించే ఓడలకు మాత్రమే పరిమితం. మరే ఇతర దేశ జెండా కింద ప్రయాణించే ఓడలపై కాదు. ఇతర దేశాల జెండాను కలిగి ఉన్న ఓడలను భారత, పాకిస్తాన్ ఓడరేవుల మధ్య ప్రయాణించడానికి అనుమ తించవచ్చని ఇది సూచిస్తుంది. అంతేకాకుండా, ఈ ఉత్తర్వు నుండి ఏదైనా మినహాయింపు లేదా కేస్–టు–కేస్ ఆధారంగా పరిశీలించబడుతుంది. నిర్ణయించబడుతుంది" అని డిజిఎస్ పేర్కొంది. అంతేకాదు, ఇది ఈ పరిమితుల నుండి మినహా యింపు కోరే అవకాశం ఉందని సూచిస్తుంది. గత రెండు వారాలుగా భారత్, పాకిస్తాన్ మధ్య దౌత్య సంబంధాలు దిగజారుతున్న నేపథ్యంలో భారతదేశం తీసుకున్న ఈ చర్య మరో తాజా నిర్ణయం. జమ్మూ కాశ్మీర్‌లోని ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశంలో సాయుధ ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను చంపిన ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి తరువాత, నిరాయుధులైన భారతీయులపై జరిగిన ఘోరమైన దాడికి ఇస్లామాబాద్ మద్దతు ఉన్న ఉగ్రవాదులే కారణమని న్యూఢిల్లీ నిందించడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. అవి వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయి.


# ఆ ఉగ్రవాదుల్ని వదిపెట్టం.. స్పష్టం చేసిన ప్రధాని మోదీ




జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఉగ్రమూకల కాల్పుల్లో మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కోతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని రెండు దేశాలు నమ్ముతున్నాయి. టెర్రరిస్టులపై .. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్లు ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాము. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచాము' అని అన్నారు.

# భీమవరంలో దారుణం.. నడిరోడ్డుపై కత్తి పట్టుకుని...

**పశ్చిమగోదావరి, (రాజధాని వార్తలు):** మతిస్థిమితం లేని వ్యక్తులు ఎప్పుడు ఎలా ఉంటారో వారికే తెలియదు. వారిని ఎంతకని పెట్టుకుని ఉన్నప్పటికీ ప్రమాదకర పరిస్థితులను తెచ్చిపెట్టుకుంటారు. తమను తాము హానీ చేసుకోవడమో.. లేక ఇతరులపై దాడి చేయడమో చేస్తుంటారు. ఇలాంటి వాళ్లు రోడ్లపైకి వస్తే జనం పరిస్థితి ఇక అంతే. ఏ క్షణంలో ఏం చేస్తారో తెలియక భయాందోళనకు గురవుతుంటారు. అయితే భీమవరంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనితో ప్రజలు వణికిపోయారు. అతడి దగ్గరకు వెళ్లాలంటేనే భయపడిపోయారు. ఇంతకీ అతడు ఏం చేశాడు.. ప్రజల భయాందోళనకు కారణమేంటో ఇప్పుడు తెలుసుకుందాం. జిల్లాలోని భీమవరంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై హల్‌చల్ చేశాడు. అతడు చేస్తున్న పని చూస్తి అంతా అవాక్కయ్యారు. ఏం జరుగుతుందో తెలిసేలోపే అతడు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. అతడి దగ్గరకు వెళ్లడానికి కూడా ఎవరూ సాహసం చేయలేకపోయారు. ఆ వ్యక్తి చేస్తున్న పనిని చూస్తూ కూడా ప్రజలు, స్థానికులు పట్టించుకోలేదు. చివరకు అందరూ చూస్తుండగానే ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈరోజు (శనివారం) ఉదయం నడిరోడ్డుపై వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి తనతో పాటు కత్తిని తెచ్చుకున్నారు. జనాల మధ్యలో నిలబడి తన పీకను తానే కోసుకునేందుకు ప్రయత్నించాడు. ఇదంతా కూడా అక్కడే ఉన్న జనం చూస్తున్నప్పటికీ కూడా దగ్గరకు వెళ్లలేదు.



అతడు చేసే పనిని చూస్తూ నిలబడ్డారే తప్ప ఆపే ప్రయత్నమూ చేయలేదు. దీంతో ఆ మతిస్థిమితం లేని వ్యక్తి నడిరోడ్డుపై పీకకోసేసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం అవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉండికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే సదరు వ్యక్తి తొలుత యనమదర్రు డ్రైన్‌లోకి దూకగా.. అతడిని పోలీసులు రక్షించారు. ఆ తరువాత మల్టీప్లెక్స్ ఎదుట కత్తితో హల్‌చల్ చేశాడు. కాలు దగ్గర కోసుకున్నాడు కూడా. అనంతరం పీకకోసుకోవడంతో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు పోలీసులు.

# రేషన్‌కార్డుదారులకు నో చింత.. గడువు పెంచిన సర్కార్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు కసరత్తు చేపట్టిన సర్కార్.. కార్డుల జారీకి ముందు రేషన్‌కార్డుకు ఈ కేవైసీ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందుకోసం ఓ గడువును కూడా విధించింది. ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డు ఈ కేవైసీ చేసుకునేందుకు గడువు విధించింది సర్కార్. అయితే ఏప్రిల్ 30 తేదీ దాటినప్పటికీ కొందరు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదు. పలు కారణాలతో ప్రజలు ఈ కేవైసీని పూర్తి చేయలేకపోయారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి కోసం ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ కేవైసీనీ చేసుకునేందుకు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఆ గడువులోపు ఈకేవైసీని పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కాగా.. బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ ప్రక్రియను తీసుకు వచ్చింది ప్రభుత్వం. అందులో భాగంగానే జనవరిలోనే ఈకేవైసీపీ ప్రక్రియను ప్రారంభించింది. ఈకేవీసీ పూర్తి చేసుకునేందుకు ఏప్రిల్ 30 వరకు గడువు విధిస్తూ.. ఆలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని పక్షంలో రేషన్ సరుకులు నిలిపివేస్తామని అధికారులు ప్రకటనలు ఇచ్చారు. రేషన్‌కార్డులు ఉన్న వారు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఈ కేవైసీని చేసుకునే విధానాన్ని కూడా అమలులోకి తీసుకొచ్చారు. అయితే కొన్ని కారణాల వల్ల చాలా మంది ఈకేవైసీని పూర్తి చేయలేకపోయారు. అలాంటి వారి కోసమే మరో రెండు నెలల పాటు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది ఏపీ ప్రభుత్వం.

**కారణాలు ఇవే..**


ఆన్‌లైన్‌లో ఈకేవైసీని చేసుకునేందుకే చాలా మంది ముందుకు వచ్చారు. అయితే చాలా గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడ్డారు. దీంతో రేషన్ డీలర్లపైనే ఆధారపడాల్సి వచ్చింది. కానీ ఈకేవైసీ చేసేందుకు కొందరు రేషన్ డీలర్లు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే ప్రజలు వెళ్లే సమయానికి రేషన్ షాపులు క్లోజ్ అవడం కూడా ఒక కారణమనే చెప్పుకోవచ్చు. అంతే కాకుండా చాలా మంది విద్యార్థులు వేరే ప్రాంతాల్లో ఉంటూ చదువకోవడం వల్ల కూడా వారు ఈ కేవైసీని చేసుకోలేకపోయారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈకేవైసీ చేసుకునేందుకు గడువు పెంచాలని నిర్ణయించింది. అందులో భాగంగా జూన్ 30 వరకు ఈకేవైసీ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ప్రతీ ఒక్కరు కూడా ఈ కేవైసీ చేసుకునేలా చూస్తామని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా చాలా ప్రాంతాల్లో ప్రజలు వేరే ఇళ్లకు వెళ్లిపోవడంతో వీరంతా కూడా ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉంది. వీరంతా కూడా వారు ఎక్కడైతే రేషన్ తీసుకుంటారో అక్కడే ఈ కేవైసీ చేసుకో వచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని జూన్ 30 లోపు ఈ కేవైసీని మీ దగ్గరలోని రేషన్ డీలర్ల వద్ద లేదా ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముమ్ముందు ఈ కేవైసీ ఉంటే రేషన్ సరుకులు పొందే అవకాశం ఉంటుందని.. లేకపోతే రేషన్ సరుకులు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సో.. ఇప్పటి వరకు ఈకేవైసీ చేసుకోని వారు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసి రేషన్ సరుకులు పొందండి.

# ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయింది



**మహబూబ్‌నగర్ సిటీ, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇవాళ (శనివారం) మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మీడి యాతో మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుడు కులగణన అని విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే కులగణన అనే మాట మాట్లాడారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మొట్టమొదటి కులగణన 1931లో జరిగిందని ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. ముస్లింలని బీసీ జాబితాలో చేర్చడం అంటే నిజమైన బీసీలను మోసం చేయడ మేనని అన్నారు. 2026లో డీ లిమిటెషన్‌కి వెళ్తున్నామని అన్నారు. బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు. జనగణ నతో పాటు కులగణన చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక గొప్ప సంకల్పమని అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటుగా ఎంపీలకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కోటాను కల్పించాలని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.

# పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లను ఇవాళ (శనివారం) రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకున్నారు. పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలువ పందిళ్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. 12 రోజుల పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రెండు నెలల క్రితం పులి సంచరిస్తోందని సోషల్ మీడియాలో వచ్చిన నేపథ్యంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం ఆదేశించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అర్చకుల సూచనల మేరకు ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.

# కమ్యూనిస్టు యోధుల సేవలు ప్రశంసనీయం

**- ప్రకాశిస్తున్న ఎర్ర సూర్యులకి ఆర్.పి.వి. వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి అధ్వర్యంలో ఘన సత్కారం - అలసి సొలసిన భుజాల కామ్రేడ్ల ఇంటి తలుపు తట్టి పలకరించిన ఆర్ పి వి ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలి - దివంగత ఎమ్మెల్యే రజబ్ అలీతో ఉన్న అనుబంధాలను సాదిక్ అలికు వివరించి కమ్యూనిస్టు పార్టీ ఘన చరిత్రను గుర్తు చేసుకున్న కామ్రేడ్స్..ఆర్ పి వి..సంస్థ పురస్కారాలకు మురిసిన కామ్రేడ్స్**

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** కార్మికుల దినోత్సవం మే డే పండుగను పురస్కరించుకుని గత ఆరు దశాబ్దాలుగా ఎర్రజెండా నీడన శ్రమిస్తూ... ఆనాటి ఎమ్మెల్యే రజబ్ అలీతో కలిసి ఎర్రజెండాను తన భుజ స్కంధాలపై మోసి... పార్టీ నిర్మాణం కోసం, ఆనాడు అవిశ్రాంతంగా శ్రమించి..సిపిఐ పార్టీ తరపున సర్పంచ్ పదవులలో ప్రాతినిధ్యం వహించి ప్రజలకు ఆనాడు మేమున్నామనే భరోసాను కల్పించి ప్రజలను అన్ని విధాలా ఆదుకుని, నేడు విశ్రాంతి పొందుతున్న అలసి సొలసిన భుజాల కామ్రేడ్‌ల నివాసాలకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలి... ఆప్యాయపు పలకరింపులతో బాబాయ్.. ఎలా ఉన్నారు.. ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగారు. ఖమ్మం జిల్లాలోని. తనికెళ్ళ గ్రామంలోని మాజీ సర్పంచ్ (సీపీఐ) గడల సీతారా మయ్య, మరో మాజీ సర్పంచ్ (సిపిఎం) కొత్తపల్లి నారాయణరావు, ఖమ్మం నగరంలోని నగర నేత సీపీఐ నాయకులు మహమ్మద్ సలాంలను పలుకరించారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలకు నిదర్శనంగా వారి శ్రమకు గుర్తింపుగా సముచిత గౌరవాన్ని ఇస్తూ సయ్యద్ సాదిక్ అలి సెల్ఫీలు దిగారు. కార్మికుల పండుగ రోజున తమను గుర్తు పెట్టుకొని తమకు సముచిత గౌరవాన్ని ఇస్తూ సత్కరించడం తాను తన మాటల్లో వర్ణించలేక పోతున్నానని





తన్మయత్వంతో సంభ్రమాశ్చర్యాలకు లోనై ఆనందభాష్పాలతో పేగు బంధం వలె ఆత్మీయతను చూపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య మాట్లాడుతూ తమ పార్టీ కార్యక్రమాలలో భాగంగా ఆనాడు దివంగత ఎమ్మెల్యే రజబ్ అలీతో కలిసి పనిచేసిన గత అనుభవాలను సాదిక్ అలితో పంచుకున్నారు.. మహమ్మద్ రజబ్ అలి ఆనాడు గిరిజన, పేద ప్రజల హృదయాలను గెలుచుకున్న నేపథ్యంలో తాను వారితో కలిసి నడిచానని, పార్టీ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అయినని సాదిక్ అలీకి వివరించారు. అనంతరం తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ కొత్తపల్లి నారాయణరావు మాట్లాడుతూ 1985 వరకు సర్పంచ్‌గా పని చేశానని 85 తర్వాత సిపిఎం పార్టీలోకి చేయడం జరిగిందని ఆయన అన్నారు. దివంగత ఎమ్మెల్యే రజబ్ అలీ హయాంలో తుమ్మల పల్లి గ్రామాన్ని సృష్టించామని ఆనాడు ఇక్కడ రహదారులు, విద్యుత్, సరఫరా లేవని, పోడు భూములను నరికి ఆనాడు ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇచ్చిన పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. అనంతరం సిపిఐ నగర నాయకులు మహమ్మద్ సలాం మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం మేడే పండుగ రోజున కార్మిక జెండా ఆవిష్కరణలు ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో తమ సేవలను గుర్తించి రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ తమను సత్కరించడం సంతోషంగా ఉందని.. పార్టీ నాకు పోషించిన కార్యక్రమాలన్నీ ఈ సత్కారాలు తమకు స్ఫూర్తి నిస్తాయని ఆయన అన్నారు. మే డే కార్మిక దినోత్సవమైన కార్మికుల దినోత్సవ మే డే పండుగను పురస్కరించుకొని పార్టీకి విశేష సేవలు అందిస్తూ నాయకులుగా వెలుగొందుతున్న వారిని తమ రాజ్యాంగ పరిరక్షణ వేదిక గుర్తించి ఈ సత్కారాలను మేడే వారోత్సవాల్లో భాగంగా ఏడు రోజులు పాటు కార్యక్రమాలను నిర్వహించ బోతున్నామని ఈ సందర్భంగా వారిని కలిసి వారి గత అనుభవాలను రాజకీయ పటిమ, వారి పోరాటాలను స్వయంగా తెలుసు కోవడం తనకెంతో అనుభూతిని ఇచ్చిందని సయ్యద్ సాదిక్ అలి అన్నారు.. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి అధ్యక్షులు సుభాని తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను 100%, 5% రిబేట్‌లలో మొదటి స్థానం వచ్చినందుకు గాను మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ పత్రం అందజేత



**జమ్మికుంట, (రాజధాని వార్తలు):** జమ్మికుంట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానం సాధించినందుకు గాను మున్సిపల్ సెక్రటరీ టి.కే.శ్రీదేవి ఐఏఎస్, మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో 100% వసూలు చేసి మొదటి స్థానం సాధించినందుకు గాను, జమ్మికుంట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం.. పట్టణ అభివృద్ధికై మూడు కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌కు అందజేసినట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మార్చి నెలకు ముందుగానే పన్ను వసూళ్లు పూర్తి చేయాలని కమిషనర్ అయాజ్‌ను, సిబ్బందిని ఆదేశించారు. పన్ను వసూళ్లలో కష్టించి పని చేసిన మున్సిపల్ సిబ్బందిని మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మూడు కోట్ల నిధులు పట్టణంలోని జంక్షన్‌లతో మున్సిపాలిటి ఆదాయం సమకూర్చే వాటికి, అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్.ఐ. భాస్కర్, ఆర్.ఓ వాణి, మున్సిపల్ అధికారులు మహేష్, బిల్ కలెక్టర్ మొగిలయ్య, పాషా, కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలి

**- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న**



**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** మహబూబాబాద్ ఐ.డి.ఓ.సిలోని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ తదితర మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులను ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, మల్బరీ తదితర మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుకు సమాయత్తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఆయిల్ పామ్, మిరప, పండ్లు, కూరగాయలు తదితర కరపత్రాలను క్షేత్రస్థాయి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, ఆయిల్ ఫెడ్, బిందు సేద్య అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**(రాజధాని వార్తలు):** కులగణన చేపట్టడానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ జమ్మి కుంట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషే కం నిర్వహించడం జరిగింది. జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆద్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రబెల్లి సంపత్‌రావు, కొలకాని రాజు, జీడి మల్లేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన అంటే జనాభా లెక్కల సమయంలో ప్రజల కులాల వారిగా సమాచారాన్ని సేకరించడం అని, దేశంలోని వివిధ కులాల సమూహాల పంపిణీ, సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని ప్రభుత్వ పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని, నేటికీ మన దేశంలో అక్కడక్కడా కుల వివక్ష ఉందని దానిని రూపు మాపేందుకు ఈ కులగణన ప్రజల్లో అవగాహన కల్పించి దోహదపడుతుంది అని చెప్పారు. తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన సరిగా లేదని, తప్పుల తడక ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మోతె స్వామి, ఇటుకాల స్వరూప, కేశ స్వరూప, గంగాభవాని, కైలాసకోటి గణేష్, యగ్గని చందు, రాజేష్ ఠాకూర్, రాకేష్ ఠాకూర్, మోడం రాజు, ముకుందా సుధాకర్, అప్పాల రవిందర్, కురిమిల్ల అశోక్, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్తి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ


**- డియం & హెచ్ఓ డాక్టర్ బి రవి రాథోడ్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు**

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్ భాగంగా శుక్రవారం మహబూబాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ సికిల్ సెల్ అనీమియా వ్యాధిగ్రస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేక వంశానుగత రక్త రుగ్మత, సాధారణ మనిషి రక్తంలోని ఎర్ర రక్తకణాలు గుండ్రని ఆకారంలో ఉంటాయని, ఈ కణాలు రక్త నాళాల ద్వారా, శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు, ప్రాణవాయువును సరఫరా చేస్తుంటాయన్నారు. కొంతమందిలో జన్యు సంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మార్పు చెందుతాయని, ఈ సికిల్ సెల్ ఉన్న వారి రక్తకణంలోని ఒక జన్యు సికిల్ సెల్ గాను, ఒకటి మామూలుగాను, ఉన్నట్లయితే అటువంటివారిని, సికిల్ సెల్ క్యారియర్లు వీళ్ళకి, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని, అయితే వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వీరికి పుట్టే పిల్లలు రక్త కణంలోని రెండు జన్యులు వంపు తిరిగి ఉంటాయన్నారు. ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతున్నారని, తగిన చికిత్స



తీసుకో కపోతే, తీవ్రమైన సమస్యలతో బాధపడుతారని అన్నారు. సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు సాధారణంగా ఆరు నెలల వయసులో ప్రారంభమవుతాయని అది ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి భిన్నంగా ఉంటాయని కాలక్రమేణా మారవచ్చుని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేసి యుడిఐ, ఐడి అప్లికేషన్ పోర్టల్‌లో అప్లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనిత పిడియాటిషన్, డాక్టర్ హితేష్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ జ్యోతి రెడ్డి పెథాలజిస్ట్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కెవి రాజు, పురుషోత్తం, సూపర్వైజర్ నాగ బ్రహ్మాచారి, ఉమాకర్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి పునః ప్రారంభ సభ ఘన విజయం



**గిద్దలూరు, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజక వర్గం నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిలో నిర్వహించబడిన పునఃప్రారంభ సభ అఖండ విజయవంతంగా ముగిసింది. ఈ మహాసభలో గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడం గర్వకారణమని గౌరవ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ విజయవంతానికి సహకరించిన మద్దతు తెలిపిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకి, అభిమానికీ శాసన సభ్యులు అశోక్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎర్రబొమ్మల, కిటుముల గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికైన తాజా నాయకత్వం

**- టీడీపీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి**



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండలంలోని ఎర్రబొమ్మల మరియు కిటుముల గ్రామ కమిటీ ఎన్నికలు శాంతియుతంగా, ఏకగ్రీవంగా ముగిశాయి. ఎర్రబొమ్మల పంచాయతీలో మామిడి రాజబాబు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, సగ్గె కుసిల ఉపాధ్యక్షుడిగా కిటుముల గ్రామ కమిటీకి గిన్నెల వెంకట్రావు అధ్యక్షుడిగా, కోరాబు రామారావు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. ఈ ఎన్నికలు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించ బడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ రావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, పీసా కమిటీ మండల ఉపాధ్యక్షుడు దూరి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు సత్తిబాబు, అబ్బాయి నాయుడు, లక్ష్మణ్, అలాగే తెలుగు యువత నాయకుడు గణపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన నాయకత్వాన్ని కార్యకర్తలు అభినందించారు. గ్రామ అభివృద్ధికి పాలకుల సహకారంతో పనిచేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు.

# చిరంజీవి మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

**పర్చూరు, (రాజధాని వార్తలు):** ఇడుపులపాడు తెలుగుదేశం పార్టీ యువనేత అంబటి మురళి తండ్రి చిరంజీవి మృతి పట్ల తెలుగు దేశం పార్టీ బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. చిరంజీవి మృతి ఆయన కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అన్నారు. మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. చిరంజీవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఎమ్మెల్యే ఏలూరి మురళిని ఫోన్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు ఇంకొల్లు మండల తెలుగుదేశం పార్టీ



అధ్యక్షులు నాయుడు హనుమంతరావు గ్రామ సీనియర్ నేత బాపయ్య చౌదరి, సురేష్, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వెంకట్, అఖిల్ గ్రామ నేతలు పాల్గొన్నారు.

# రష్మిక మందన్న రిప్లైకి అర్థం అదేనా?



వెండితెరపై కొన్ని జంటలకున్న క్రేజ్ మరే జంటకూ ఉండదు. కారణం వారిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీనే. ఆ కెమిస్ట్రీ కారణంగానే ప్రేక్షకులు హిట్ పెయిర్ మళ్లీ మళ్లీ కలిసి నటిస్తే చూడాలని ముచ్చటపడుతుంటారు. ఇప్పుడు అలాంటి ఓ క్రేజీ జోడీ కలిసి నటించే చూడాలని అభిమానులు, సినీలవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జోడీ మరెవరో కాదు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరు కలిసి 'గీత గోవిందం'లో తొలిసారి నటించారు. వీరి కెమిస్ట్రీ వర్కవుట్ కావడంతో సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరి రికార్డు సృష్టించింది. ఇక ఆ తరువాత కలిసి చేసిన మూవీ 'డియర్ కామ్రేడ్'. ఇది కేవలం రష్మిక కోసమే విజయ్ చేసినట్టుగా ఉంటుంది. 'గీత గోవిందం' అంత కాకపోయినా ఆడియన్స్‌ని మాత్రం విశేషంగా ఆకట్టుకుని ఈ జంటకు హిట్ పెయిర్ అనే ముద్ర వేసింది. 2019లో ఈ మూవీ విడుదలైంది. ఆ తరువాత నుంచి వీరిద్దరు కలిసి మరో సినిమాలో నటించ లేదు. మళ్లీ ఇన్నేళ్లకు వీరిద్దరు కలిసి నటించబోతున్నారనే వార్తలు తాజాగా వినిపిస్తున్నాయి. తాజాగా మైత్రీ మూవీమేకర్స్ వారు పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై ఇవ్వడంతో ఆ వార్తలు నిజమేనని క్లారిటీ వచ్చేసింది.

విజయ్ దేవర కొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో రూపొందు తున్న 'కింగ్‌డమ్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్ట్ ప్రోడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. దీని తరువాత రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ డ్రామాలో నటించనున్నాడు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించబోతున్నారు. ఈ భారీ మూవీ వచ్చే నెల హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. ఇందులో విజయ్‌కి జోడీగా రష్మిక నటించనుందనే వార్తలు వినిపిస్తు న్నాయి. దీనిపై నిర్మాణ సంస్థ తాజాగా 'వేచి చూద్దాం' అని అర్థం వచ్చేలా ఓ పోస్ట్ పెట్టింది. దానికి రష్మికను ట్యాగ్ చేసింది. దీనికి రష్మిక రిప్లైగా 'ఓకె' అంటూ నవ్వు తున్న ఎమోజీలను పోస్ట్ చేసింది. దీంతో చాలా గ్యాప్ తరువాత రౌడీ, రష్మికల జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. రష్మిక ఇదే విషయాన్ని తాజాగా కన్ఫర్మ్ చేసిందని చెబుతున్నారు. ఇదే నిజమైతే మరో సారి క్రేజీ జోడీ స్క్రీన్‌పై సందడి చేయడం ఇక లాంఛనమే.

# ఇప్పటికైనా నేచురల్ స్టార్‌ని ఫాలో అవుతారా?



ఈగోలే రాజ్యమేలే ఇండస్ట్రీ.. అఫ్ కోర్స్ ఎక్కడైనా ఈగో హర్ట్ అయితే అవతలివాడి కెరీర్‌కు మూడినట్టే. అయితే ఇది మన ఇండస్ట్రీలో మాత్రం ఎక్కువగా వర్కవుట్ అవుతూ ఉంటుంది. కెరీర్‌లో మెట్లు ఎక్కుతున్న క్రమంలో ఎవరి ఈగో అయినా హర్ట్ అయిందా కెరీర్ గోవిందా. ఈగోలే ప్రధానంగా సాగే ఈ ఇండస్ట్రీలో హీరోగా ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా నిలడటం, అందులోనూ నలుగురికి ఆదర్శంగా నిలవడం మామూలు విషయం కాదు. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపిస్తున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా క్లాప్ బాయ్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి యాక్సిడెంటల్‌గా హీరోగా మారి టాలీవుడ్ తెరపై అద్భుతాలు సృష్టిస్తున్నారు. జెండాపై కపిరాజు సమయంలో వరుస ఫ్లాపులతో కాస్త తడబడినా తేరుకుని మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఆ సమయంలో ఇక నాని పని అయిపోయిందనే కామెంట్‌లు వినిపించినా తనపై తనకున్న గట్టి నమ్మకంతో విభిన్నమైన కథలని ఎంచుకుని మళ్లీ సక్సెస్ బాట పట్టాడు. మారుతి తెరకెక్కించిన భలే భలే మగాడివోయ్ సినిమాతో యూఎస్ బాక్సాఫీస్ వద్ద వన్ మిలియన్ మార్కు వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరచడమే కాకుండా ఈ సినిమాతో రూ.50 కోట్ల క్లబ్‌లో చేరి అందరిని విస్మయానికి గురి చేయడం తెలిసిందే.

అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోని నాని అదే ఫార్ములాని పాటిస్తూ విభిన్నమైన కథలతో వరుసగా విజయాల్ని తన ఖాతాలో వేసుకుంటూ వస్తున్నారు. ఎవరూ టచ్ చేయని కథలని, పాత్రలని ఎంచుకుంటూ వాటితో బ్లాక్ బస్టర్లని దక్కించుకుంటూ హీరోగా, నిర్మాతగా వరుస విజయాల్ని సొంతం చేసుకుంటున్నాడు. ఇండస్ట్రీలో ఎవరి అండలేకుండానే ప్రవేశించిన నాని ఇండస్ట్రీలో స్వతహాగా ఎదగాలనుకున్న వారికి ఓ రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. దసరాతో వంద కోట్ల మార్కుని టచ్ చేసిన నాని తాజాగా హిట్ 3తో ఆ మార్కుని మరో సారి టచ్ చేయబోతున్నాడు. రీసెంట్‌గా విడుదలైన హిట్ 3 ఇప్పటి వరకు వరల్డ్ వైడ్‌గా రూ.62 కోట్ల మార్కుని టచ్ చేసింది. దీంతో హీరోగా మిరాకిల్స్ చేయాలనుకున్న వారు ఇప్పటికైనా నానిని ఫాలో అయితే బెటర్ అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

# ఇక విజయ్ దుమ్ముదులపాల్సిందేనా?



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండకు సాలీడ్ బ్లాక్ బస్టర్ పడి ఏళ్లు గడుస్తున్నాయి. గతంలో రాకెట్ స్పీడుతో వ్యవహరిస్తూ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లు, మీడియా ఇంటరాక్షన్ లలో స్పీడు చూపించిన విజయ్ దేవరకొండ లైగర్ అట్టర్ ఫ్లాప్ తరువాత ఎందుకో బాగా సైలెంట్ అయిపోయాడు. క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్‌తో తొలిసారి సినిమా, ఆయన ట్రాక్ రికార్డ్‌ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి క్వశ్చన్‌లు, అనుమానాలు పెట్టుకోకుండా తను ఏది చెబితే అది చేస్తూ విజయ్ లైగర్ కోసం మూడేళ్లు శ్రమించాడు. కానీ ఫలితం శూన్యం. చేతులకు పుళ్లుపడేలా శ్రమించినా నమ్మిన డైరెక్టర్ కథ, కథనాలు, క్యారెక్టర్‌ని సరిగా డిజైన్ చేయలేకపోవడం వల్లే లైగర్ దారుణంగా ఫ్లాప్ అయంది. ఈ సినిమాతో తొలిసారి బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ దున్నేయాలని ప్లాన్ చేసుకున్న విజయ్ దేవరకొండకు లైగర్ తేరుకోలేని దెబ్బకొట్టింది. మూడేళ్లు శ్రమించిన సినిమా ఆశించిన ఫలితాన్ని రాబట్టలేక డిజాస్టర్ కావడం, అంతే కాకుండా పాన్ ఇండియా కలని తొలి ప్రయత్నంలోనే చిదిమేయడంతో రౌడీ చాలా హార్ట్ అయ్యాడట. దీంతో అప్పటి నుంచి తన పంథాకు భిన్నంగా విజయ్ దేవరకొండ సైలెంట్ అయిపో యాడు. అయితే త్వరలో కింగ్‌డమ్ మూవీతో భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి విజయ్ రెడీ అవుతున్నాడు.

ఈ సినిమాతో మళ్లీ పాన్ ఇండియా స్థాయిలో బౌన్స్ బ్యాక్ కావాలనే పట్టుదలతో ఉన్నాడట. గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న కింగ్‌డమ్ ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కాబోతోంది. దీంతో మేకర్స్ ప్రమోషన్స్‌ని ప్రారంభించారు. తాజాగా హృదయం లోపల... అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ని విడుదల చేశారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ పాటలో విజయ్ తనదైన రొమాన్స్‌తో అర్జున్‌రెడ్డి నాటి రోజుల్ని గుర్తు చేయడంతో రౌడీ ఫ్యాన్స్ ఇక దుమ్ముదులపాల్సిందేనని కామెంట్‌లు చేస్తున్నారు. మే ప్రారంభంలో హిట్ 3తో నాని శేభారంభాన్ని అందించాడని, దాన్ని కంటిన్యూ చేస్తూ విజయ్ కింగ్‌డమ్‌తో బాక్సాఫీస్ వద్ద దుమ్ముదులపాలంటున్నారు.

సినిమా కూడా అంతా ఊహించిన దానికి మించి ఉంటుందని, ఈసారి రౌడీ బిగ్ హిట్‌తో రీసౌండ్ ఇవ్వడం ఖాయమనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. మరి రౌడీ ఈ సారి దుమ్ముదులుపుతాడా? లేదా అన్నది తెలియాలంటే మే 30 వరకు వేచి చూడాల్సిందే.

# ప్రభాస్ దీపికా రొమాన్స్.. కెవ్వు కేక..!



రెబల్ స్టార్ ప్రభాస్ బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనె కలిసి లాస్ట్ ఇయర్ కల్కి 2898 AD సినిమా చేశారు. సినిమాలో ఇద్దరు కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు కానీ అందులో వారి మధ్య ఎలాంటి కెమిస్ట్రీ లేదు. ఎందుకంటే కల్కి కథ ఆ సెటప్ అంతా వేరు. ఐతే దీపికతో ప్రభాస్ రొమాన్స్ చేస్తే చూడాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఈ క్రమంలో అలాంటి వారికి ఒక గుడ్ న్యూస్ బయటకు వచ్చింది. ప్రభాస్ సందీప్ వంగ కాంబోలో వస్తున్న సినిమాలో హీరోయిన్‌గా ఎవరిని తీసుకోవాలా అన్న వేట మొదలైంది. బాలీవుడ్ నుంచి కొందరిని సౌత్ స్టార్ హీరోయిన్స్ ఇలా అందరిని అనుకుని ఫైనల్‌గా దీపిక పదుకొనె ఐతే పర్ఫెక్ట్ అనుకున్నారట. ప్రభాస్‌తో దీపిక ఆల్రెడీ కల్కి చేసింది. కాకపోతే ఆ సినిమాలో వారిద్దరు కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు కానీ ఎలాంటి రొమాన్స్ లేదు. అందుకే సందీప్ స్పిరిట్‌లో దీపికని తీసుకున్నారట. ప్రభాస్‌తో నటించేందుకు దీపిక పదుకొనె కూడా ఓకే అనేసిందట. ఐతే సందీప్ వన సినిమాలో హీరో హీరోయిన్ రొమాన్స్ గురించి తెలిసిందే. ప్రభాస్ దీపిక ఇద్దరు సినిమాలో తప్పకుండా రొమాన్స్‌తో అదరగొట్టేస్తారని ఫిక్స్ అవ్వొచ్చు. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ మూడు సినిమాలతోనే సందీప్ సినిమా బ్రాండ్ ఏంటన్నది చూపించాడు. ఇప్పుడు ప్రభాస్‌తో చేసే స్పిరిట్‌ని కూడా అందుకు ఏమాత్రం తగ్గకుండా చేస్తున్నాడు. ప్రభాస్ స్పిరిట్ తప్పకుండా ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పించేలా చేస్తుందని అంటున్నారు. పెళ్లైనా సరే దీపిక జోరు ఎక్కడ తగ్గట్లేదు. ప్రస్తుతం అమ్మడు కింగ్‌ఖాన్ షారుఖ్ ఖాన్‌తో కింగ్ సినిమాలో నటిస్తుంది. షారుఖ్‌తో ఇప్పటికే ఐదు సినిమాల్లో నటించిన దీపిక పదుకొనె ఆరోసారి జత కడుతుంది. ప్రభాస్‌తో దీపిక కూడా కల్కి 1లో నటించగా కల్కి 2లో కూడా ఈ ఇద్దరు స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఐతే స్పిరిట్ లో ప్రభాస్, దీపిక జోడీ మాత్రం ఫ్యాన్స్‌కి ఫుల్ ఎంటర్టైన్మెంట్ అందిస్తుందని అంటున్నారు. ప్రభాస్ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం మారుతి డైరెక్షన్‌లో రాజా సాబ్ చేస్తున్నాడు. ఆ సినిమా ఈ ఇయర్ రిలీజ్ కాబోతుంది. హను రాఘవపుడి డైరెక్షన్‌లో ఫౌజీ కూడా సెట్స్ మీద ఉంది.

# బుచ్చియ్యపేట మండలంలో జిల్లా కలెక్టరు పర్యటన - అభివృద్ధి పనులు పరిశీలన, నీటితొట్టె ప్రారంభోత్సవం






**అనకాపల్లి (బుచ్చియ్యపేట), (రాజధాని వార్తలు):**ఉపాధి హామీ శ్రామికులకు కనీస వేతనం కల్పించే విధంగా పని కల్పించాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరు బుచ్చెయ్యపేట మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పర్యటనలో ముందుగా ఎల్ బిపి అగ్రహారం గ్రామంలో జరుగుచున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. శ్రామికులతో మాట్లాడుతూ వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న వేతనాలు గూర్చి అడిగితెలుసుకున్నారు. కనీస వేతనం 307 రూపాయలు వచ్చే విధంగా పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు నాటిన మొక్కను జాగ్రత్తగా సంరక్షించాలని తెలిపారు. నీటికుంట పనులను పరిశీలించి వాటి వివరాలను, నీరు వచ్చే, పోయే మార్గాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోపుడి పంచాయతీ బంగారు మెట్ట గ్రామంలో పశువుల నీటి తొట్టిని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం బుచ్చియ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని తెలిపారు. శాఖల మధ్య సమన్వయం ఉండాలని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుమా పిడి పూర్ణిమాదేవి, మండల ప్రత్యేక అధికారి గోపాలరాజా, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజకుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, ఎంపీడీవో విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్, ప్రజలు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మాతృత్వ మరణాలకు కారణమయ్యే ప్రైవేటు ఆసుపత్రులపై కేసులు నమోదు : జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా వ్యవహరించి మాతృత్వ మరణాలకు కారణమవుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై కేసులు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో జరిగిన మాతృత్వ, శిశు మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లాలో గత త్రైమాసికంలో సంభవించిన నాలుగు మాతృత్వ మరణాలకు, 29 శిశు మరణాలకు గల కారణాలను కేసులు వారీగా అడిగి తెలుసుకున్నారు. మాతృత్వ మరణాలకు సంబంధించి వివరాలను అధికారులు తెలియజేస్తూ తురకలపూడి పి. హెచ్.సి. పరిధి బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన బంగారి లావణ్య జ్వరం వాంతులతో భాధపడుతూ విశాఖపట్నం ఎంవిపి కాలనీలో గల శ్రీ సూర్య ఆసుపత్రి నందు చికిత్స తీసుకొన్న అనంతరం అత్యవసర పరిస్థితి ఏర్పడితే మెడికవర్ ఆసుపత్రికి రిఫర్ చేయగా వారు కె.జి.హెచ్. కు రిఫర్ చేయగా ఆసుపత్రి నుండి బయటకు వచ్చిన వెంటనే మరణించినట్లు తెలిపారు. మావకరపాలెం పి.హెచ్.సి పరిధి మాకవరపాలెంనకు చెందిన గన్నిలక్ష్మి విశాఖపట్నంలో గల ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంలో పిల్లల కొరకు వైద్యం తీసుకొని ఎనిమిదవ నెలలో కడుపులో పిల్లలు చనిపోయిన అత్యవసర పరిస్థితులలో కె.జి.హెచ్.కు రిఫర్ చేయగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలపారు. శ్రీరాంపురం పి.హెచ్.సి. పరిధిలో పాల్మన్ పేట గ్రామంలో ఒడిస్సాకు చెందిన మడద లావణ్య హృదయ సంబంధిత బాధపడుతూ గీతం ఆసుపత్రిలో 19 రోజుల అనంతరం కే.జి. హెచ్.కు రిఫర్ చేయగా మరణించారని తెలిపారు. నక్కపల్లి పి. హెచ్.సి. పరిధి చినగుములూరుకు చెందిన సయ్యద్ మహబున్నిషా డెలివరీ కొరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో జాయినయి సడన్‌గా పరిస్థితి విషమించి మరణించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ సరైన వైద్యం అందించకుండా, ముందుగా రిఫర్ చేయకుండా ఆఖరి క్షణంలో కె.జి.హెచ్., ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ మరణాలకు కారణమవుచున్న ప్రైవేటు ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవలసినదిగా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. గత మూడు నెలలలో సంభవించిన మరణాలకు సంబంధించిన కేసులలో అనుమతులు, అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా వైద్యం చేసి మాతృత్వ మరణానికి కారణమైన విశాఖపట్నం ఎంవిపి కాలనీలో గల శ్రీ సూర్య ఆసుపత్రి మరియు పిల్లలు కొరకు వచ్చిన వారికి చివరి వరకు వైద్యం చేసి అత్యవసర సమయంలో వైద్యం అందించకుండా బాధ్యతారాహిత్యంగా కె.జి.హెచ్.కు రిఫర్ చేసిన విశాఖపట్నంలో గల ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై పోలీసు కేసులు నమోదు చేయవలసినదిగా జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. అత్యాధునిక వైద్య సేవలు కలిగి ఉండికూడా కె.జి.హెచ్.కు రిఫర్ చేసిన ఆసుపత్రుల కేసులపై నివేదిక అందజేయాలని తెలిపారు. సంఘటనలు జరిగి నెలలు కావస్తున్నప్పటికి సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకొనుటకు నివేదికలు తయారీలో నిర్లక్ష్యం వహించడం అసంతృప్తి వ్యక్తం చేసారు. మాతృత్వ మరణాలు సంభవించకుండా పర్యవేక్షణ ఉండాలని గ్రామాలలో ఆశ వర్కర్లు బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని మెడికల్ అధికారులను ఆదేశించారు. వైద్యులు సేవాదృక్పదంతో ప్రజలకు సేవలందించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఎం.శాంతిప్రభ, డి.సి.హెచ్.ఎస్. ఎస్.శ్రీనివాసరావు, డిఐఒ కె.చంద్రశేఖర్, మెడికల్ అధికారులు, శ్రీ సూర్య ఆసుపత్రి, మెడికవర్ ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రం, గీతం ఆసుపత్రి ప్రతినిధులు, ఎ.ఎన్.ఎం.లు, ఆశ వర్కర్లు హాజరయ్యారు.

# జివో నెంబర్ 3 కు ప్రత్యామ్నాయం చూపాలని కూటమి ప్రభుత్వాన్ని కోరిన జనసేన పార్టీ పాడేరు అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత

**పాడేరు, (రాజధాని వార్తలు):** ఆదివాసీ నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చెయ్యాలని కోరారు. అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత మాట్లాడుతూ జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డా.వంపూరు గంగులయ్య, అరకు జనసేన ఇంచార్జ్ శెట్టి చిరంజీవి, పాడేరు టీడీపీ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, అరకు ఇంచార్జ్ ఏ.పిఏస్ ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర, జి.సిసి చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్, బీజేపీ పార్టీ ఇంచార్జ్ ఉమామహేశ్వరరావు మరియు కూటమి నాయకులు అందరూ జివో నెంబర్ 3 మీద ప్రతిపాదనలు వినతిలా రూపంలో ఇచ్చారని ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. గిరిజన యువతకి తీవ్ర అన్యాయం చేసిన ఘనత గత వైకాపా ప్రభుత్వానిదని మండిపడ్డారు. జివో నెంబర్ 3 పై సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. ఆ జివో నెంబర్3 ను ధర్మాసనం కొట్టి వేసిందని దీన్ని సవాల్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పిటిషన్ కూడా వేయకపోవడంతో గిరిజన నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందనీ తెలిపారు. జీవో నెంబర్ 3 ను పునరుద్దరించాలని కోర్టులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించి సాధించుకోవాలని లేదా ఆంధ్రప్రదేశ్ చట్ట తీర్మానం చేసి కేంద్రానికి పంపించి పునరుద్దరించుకోవాలని తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు జోస్యం చూసారని మండిపడ్డారు. మొదట్లో జివో నెంబర్ 3 తెచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదనే విషయం మరువకూడదని వివరించారు. జివో నెంబర్ ఇచ్చాక అనేక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదని వివరించారు. వైకాపా ప్రభుత్వం యువతకి ఉద్యోగ్య అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోగా జివో నెంబర్ 3 పోతున్న అధికారంలో ఉంది కూడా రివ్యూ పిటిషన్ వెయ్యకుండా గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద బురద జల్లే విధంగా ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. అప్పటి వైసిపి ప్రజాప్రతినిధులుగా ఉన్న కోటగుల్లి భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ, ఏస్టి కమిషన్ చైర్మన్‌గా ఉన్న కుంభ రవిబాబు, ఎస్టి కమిషన్ మెంబర్ మత్స్యరస. విశ్వేశ్వర రాజు, డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాని అప్పుడు గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే నోరు మెదపకుండా జోస్యం చూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు జివో నెంబర్ 3పై ఉద్యమాలు, పోరాడాలంటూ చేస్తున్న హడావిడి చూస్తే గిరిజన నిరుద్యోగ యువతకు, గిరిజన ప్రజలకు మభ్యపెట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్న మిమ్మల్ని గిరిజన ద్రోహులుగానే పరిగణంలోకి తీసుకుంటున్నారు అనే విషయం తెలియజేస్తున్నాం అని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైన మీకు చిత్తశుద్ధి ఉంటే మీకు నిజంగానే గిరిజన ప్రాంత ప్రజల మీద అపారమైన ప్రేమ అభిమానాలు ఉంటే అసెంబ్లీ కి వెళ్లి వాదించాలని డిమాండ్ చేశారు... ప్రజా సంఘాలు అందరికీ తెలియజేస్తున్నాం. కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యామ్మాయం జివో తీసుకొచ్చి మన ఆదివాసీ ప్రాంతానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎవరు ఆందోళన చెందకండని తెలియజేశారు...దయచేసిఈ వైకాపా పార్టీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని గమనించగలరు.. వీళ్ళను గిరిజన జాతి ద్రోహులను ఈ ఉద్యమాల్లో రానివ్వకండి మన పోరాటాల్లో న్యాయం ఉంది తప్పకుండా జనసేన పార్టీ తరపున కూటమి ప్రభుత్వం తరుపున మీకు అండగా ఉంటాం అని తెలిపారు.



# వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గణితంలో మెళకువలు




**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం శాఖా గ్రంధాలయం నందు వేసవి శిక్షణ శిబిరం 5వ రోజు పురస్కరించుకొని ఉపాధ్యాయులు సి.వరప్రసాద్ విద్యార్థిని, విద్యార్థులకు గణితంలో మెలుకువలు మరియు గణితంలో ప్రత్యేకతలు గురించి వివరించి విద్యార్థిని, విద్యార్థులచే చెప్పించడం జరిగినది. తదుపరి విద్యార్థిని, విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ జంబ్లింగ్ పజిల్స్ మరియు చదరంగం పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వివిధ రకాల స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు పాఠకులు ఉపాధ్యాయులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.




**బుచ్చయ్యపేట మండలం ఎల్ బి పి అగ్రహారం గ్రామంలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకును, పంట నీటి కుంటలను పరిశీలించి అనంతరం లోపుడి పంచాయతీ బంగారుమెట్ట గ్రామంలో పశువుల నీటి తొట్టిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan